ప్రజాశక్తి
మంగళవారం 9 జనవరి 2024 5
శ్రీ సత్యసాయి





కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

కరెంట్ ఆపే 'సారూ'..!



విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కార్మికులు లేక నిర్మానుష్యంగా ఉన్న ఓ పరిశ్రమ

ఎక్కడైనా...ఎప్పుడైనా ఎదైన శాఖకు సంబంధించి మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీలు పర్యటకు వస్తే... ఆ శాఖల అధికారులు వెంటనే అప్రమత్తం అయ్యి చిన్నచిన్న లోటుపాట్లు ఉంటే వారు రాక ముందే వాటిని సరిచేస్తారు. అయితే హిందూపురంలో ప్రాంతంలో దీనికి విరుద్ధంగా పరిస్థితి ఉంది. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి పారిశ్రామిక వాడలో పర్యటిస్తుండడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతుల పేరుతో విద్యుత్‌ను తొలగించారు. పైకి మరమ్మతులు అని చెబుతున్నా, పంచాయతీల వారీగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి పాల్గొంటున్నారని, ఈ సభలకు జనసమీకరణ కోసమే విద్యుత్ సరఫరా ఆపే'సారు'.. అనే వార్తలు బలంగా విన్పిస్తున్నాయి.

◆ అమాత్యుని సేవలో విద్యుత్ అధికారులు

◆ 'పురం' పారిశ్రామిక వాడకు కరెంట్ కట్..!

◆ జనరేటర్‌పై ఆధారపడ్డ పరిశ్రమ నిర్వాహకులు

◆ రూ. కోటి అదనపు భారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గంలో వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా వైసిపి జెండా ఎగరవేయాలని సంకల్పించి ఆ పార్టీ రాయలసీమ కో ఆర్డినేటర్, విద్యుత్ శాఖ మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం నుంచి ఆరు రోజుల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా సమావేశాలను మొదలు పెట్టారు. అన్ని పంచాయతీల వారీగా సమావేశాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సోమవారం నాడు చౌళూరు, తూమకుంట, గోళాపురం, కొటిపి, కిరికెర, బేవినహళ్లి పంచాయతీల్లో సమావేశాలను ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వాడలో ఉన్న గార్మెంట్స్ పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమల్లో ఉపాధి కోసం జనం వెళ్తారని నాయకులు భావించారు. సమావేశాలకు జన సమీకరణ చేయాలంటే పరిశ్రమలకు సెలవు ఇప్పించాలని అనుకున్నారు. ఇది సాధ్యం కాకపోవడంతో విద్యుత్ అధికారుల నుంచి సెలవు ప్రకటించాలని ఒత్తిడి తెచ్చారు. అప్పటికీ పరిశ్రమల యజమానులు వినకపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులను అడిగితే మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశామని చొప్పుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. విద్యుత్ లేకపోవడంతో ఆ ప్రాంతాల్లో ఉన్న అన్ని పరిశ్రమల నిర్వాహకులు జనరేటర్‌పై ఆధారపడ్డారు. ఒక్క రోజుకు దాదాపు కోటి రూపాయల అదనపు భారం పరిశ్రమల యజమానులపై పడినట్లు తెలుస్తోంది. చిన్న పరిశ్రమల నిర్వాహకులు అదనపు భారాన్ని భరించలేక విద్యుత్ కోసం ఎదురుచూశారు. నిత్యం కార్మికులతో కన్పించే పరిశ్రమలు కాస్తా సోమవారం నాడు నిర్మానుష్యంగా మారిపోయాయి.

సభకు గార్మెంట్స్ పరిశ్రమ మహిళా కార్మికుల తరలింపు

హిందూపురం రూరల్ మండలం చౌళూరు, తూముకుంట, గోళాపురం, కొటిపి, కిరికెర, బేవినహళ్లి పంచాయతీల్లో వైసిపి సమావేశాలను ఏర్పాటు చేసింది. జన సమీకరణ కోసం స్థానిక నేతలు పారిశ్రామిక వాడలో ఉన్న టెక్స్‌పోర్టు పరిశ్రమకు చెందిన బస్సుల్లోనే మహిళా కార్మికులను తరలించారు.

రూ. కోటి అదనపు భారం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో దాదాపు 120 వరకు వివిధ పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల నిర్వహణకు విద్యుత్ సౌకర్యం చాల అవసరం. సోమవారం విద్యుత్ శాఖ వారు మరమ్మతుల పేరుతో పారిశ్రామికవాడకు కరెంట్‌ను కట్ చేయడంతో పరిశ్రమ నిర్వాహకులకు కోటి రూపాయల వరకు అదనపు భారం పడింది. గత 30 సంవత్సరాలుగా ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు విద్యుత్ సరఫరా ఆగిపోయిందని పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.



మంత్రి సభలో కూర్చొన్న విద్యుత్‌శాఖ డీఈ భూపతి



మంత్రి సభకు గార్మెంట్స్ పరిశ్రమ మహిళా కార్మికులను తీసుకెళ్తున్న వైసిపి నాయకులు

మున్సిపల్ కార్మికుల ఆగ్రహం

◆ కలెక్టరేట్ ముట్టడి, పొర్లుదండాలు

◆ పట్టణంలో ప్రదర్శన

◆ ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం ఆగదు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మరింత ఉధృతం అయ్యింది. సోమవారం నాడు జిల్లాలోని కార్మికులు పుట్టపర్తి కలెక్టరేట్‌ను ముట్టడించారు. అన్ని మున్సిపాల్టీల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు ఇందులో పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ బైటాయించి ఆందోళన చేపట్టారు. పొర్లుదండాలు పెడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్మికుల ఆందోళనకు సిపిఎం, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేశు, మున్సిపల్ కార్మిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 14 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. పట్టణాల్లో చెత్త పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలనే కార్మికులు కోరుతున్నారని, దీనిని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లోకి ముఖ్య నాయకులు వెళ్లి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాద్రి, సాంబశివ, బాబావలి, ధర్మవరం వెంకటరాముడు, హిందూపురం నరసింహప్ప, పెనుగొండ రమేష్, కదిరి జగదీష్, పుట్టపర్తి మున్సిపాలిటీ నాయకులు రామయ్య, పెద్దన్న, నరసింహులు, నాగార్జున, గోవిందు, సరోజమ్మ, మారక్క, సాయి, ఇంజినీరింగ్ కార్మికులు రమణ, గంగాద్రి, రమేష్, డ్రెయినేజీ కార్మికులు నాగార్జున, నాగభూషణ, పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నాయకుల గృహ నిర్బంధం

ప్రజాశక్తి-పెనుకొండ



జయచంద్రారెడ్డికి నోటీసు ఇస్తున్న కానిస్టేబుల్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ దశల వారి ఉద్యమంలో భాగంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించి సమస్యలు పరిష్కరించాలని బుధవారం నాడు విజయవాడలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన 36 గంటల ధర్నాకు వెళ్లకుండా పోలీసులు అడ్డగింతలు చేస్తున్నారు. యుటిఎఫ్ నాయకులకు నోటీసులు ఇచ్చి ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రారెడ్డిని సోమవారం సాయంత్రం ధర్మవరంలో ముందస్తు గృహ నిర్బంధం చేశారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ చలమారెడ్డి ముందస్తు నోటీసు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపాలనుకోవడం ప్రభుత్వం దిగజారుడు తనానికి నిదర్శనం అని జయచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం నిరంకుశ వైఖరి వీడాలి



ఎం.సుధాకర్‌కు నోటీసు ఇస్తున్న కానిస్టేబుల్

ప్రభుత్వం నిరంకుశ వైఖరిని విడనాడాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడలో చేపట్టనున్న 36 గంటల ధర్నాకు హాజరు కాకుండా పోలీసులు సోమవారం మధ్యాహ్నం సుధాకర్‌కి నోటీసులు అందజేశారు. సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక బాకాయిల కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన 36 గంటల నిరసన దీక్షను భగ్నం చేసేందుకు ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడ సమంజసం కాదన్నారు. ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి అడ్డూ అదుపు లేకుండా పోతోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, దీనికి ప్రభుత్వం త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు.

కాళేశ్వర్ ఆశయసాధనకు కృషి

షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప

ప్రజాశక్తి -పెనుకొండ



నవ్యశ్రీ కంటి ఆసుపత్రి పున:ప్రారంభోత్సవంలో పాల్గొన్న శిల్ప, తదితరులు

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శివ సాయి మందిరం వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ కాళేశ్వర్ ఆశయసాధనకు శక్తి వంఛన లేకుండా కృషి చేస్తానని షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప తెలిపారు. కాళేశ్వర్ జయంతి సందర్భంగా పట్టణంలోని శివసాయి మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన నవ్యశ్రీ ఉచిత కంటి వైద్యశాలను సోమవారం శిల్ప పున:ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సాయి కాళేశ్వర్ పేద ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందులో భాగంగా 2007లో ఉచిత కంటి వైద్యశాలను ప్రారంభించి ఎందరికో కంటి ఆపరేషన్లు చేయించారన్నారు. కరోనా సమయంలో కొద్ది రోజులు సేవలు నిలిపేశామని, ఇప్పుడు నేత్రశాలను పున:ప్రారంభించామ న్నారు. ఈ వైద్యశాలలో నిరంతరం పేదలకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కంటి అద్దాలు, ఇవ్వటంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. వైద్యులు కన్నీగంటి భాస్కర్ ఆధ్వర్యంలో 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 38 మందికి కంటి అద్దాలు అందజేసి, ఏడుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డిపిఎం అనురాధ, డిఎఫ్ఒ హనుమంతరెడ్డి, ట్రస్ట్ నిర్వాహకులు విజయభాస్కర్ రెడ్డి, ఎజిపిఎం భాస్కర్‌రెడ్డి, ప్రగతి శ్రీనివాసులు, చిట్టిబాబు, హరి, బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో జగన్ ప్రభుత్వం విఫలం : గుండుమల

ప్రజాశక్తి-మడకశిర



విలేకరులతో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

వైసిపి హయాంలో రైతులకు ఒరిగిందేమీ లేదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం జగన్ ఎపిని కౌలు రైతులు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో, రైతుల ఆత్మహత్యల్లో మూడో స్థానంలో, రైతుల అప్పుల్లో మొదటి స్థానంలోకి తెచ్చాడన్నారు. ధాన్యం కొనేవారు లేరు, డ్రిప్ సబ్సిడీలు రావు, మద్దతు ధర దక్కకుండా చేసిన రైతు ద్రోహి జగన్ అని మండిపడ్డారు. రివర్స్ టెండర్ల పేరుతో ఇరిగేషన్‌ను నాశనం చేశాడన్నారు. టిడిపిపై కోపంతో పట్టిసీమను నిర్లక్ష్యం చేశాడని, రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరాన్ని గోదాట్లో కలిపేశాడన్నారు. ప్రాజెక్టులు కాదు కదా.. కనీసం కాలువల్లో పూడిక తీయలేదన్నారు. ఒక్క డీఎస్సీ నిర్వహించలేదని, పోలీసు ఉద్యోగాలు భర్తీ చేయకుండా యువత భవిష్యత్తును అంధకారం చేశాడన్నారు. పన్నుల బాదుడుతో రాష్ట్ర ప్రజల రక్తం పీల్చారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలకు కోత పెట్టారన్నారు. ప్రతిపక్షనేతగా అమరావతే రాజధాని అని, నేడు మూడు ముక్కలాటతో నవ్వుల పాలు చేశాడన్నారు. జగన్ పని అయిపోయింది. వైసిపి 95 శాతం ప్రజా మద్దతు కోల్పోయిందని సర్వేల్లో సైతం తేలిందన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బిసిల భరోసా బాట'

ప్రజాశక్తి-అమరాపురం

టిడిపితోనే బిసిల భవిష్యత్తుకు భరోసా అని ఆ పార్టీ రాష్ట్ర కుంచితి ఒక్కలిగ సాధికార సమితి కన్వీనర్ ఎం.పాండురంగప్ప తెలిపారు. 'బిసిల భరోసా బాట' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన అమరాపురంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సైకో జగన్ ప్రభుత్వం బిసిలను అన్నివిధాలా అణగదొక్కే కార్యక్రమం చేపట్టిందని మండిపడ్డారు. 2024లో టిడిపి అధికారం లోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు అశ్వత్తరామప్ప, ఆదినారాయణ, రాజగోపాల్, రామాంజనేయులు, కిష్టప్ప, రమేష్, డిజె.రామప్ప, తిమ్మేగౌడ్, ఉగ్ర నరసింహప్ప, ప్రభాకర్, తిప్పేస్వామి, శివన్న, చంద్రశేఖర్, ఎస్ఎం.మాలప్ప, హనుమంతరాయప్ప, పాండురంగప్ప, రంగప్ప, హనుమంతరాయ, రంగయ్యగౌడ్, వీరకేతరాయప్ప, మంజునాథ్, శివకుమార్, రాధాకృష్ణ, సన్న మారేగౌడ్, ఎస్.తిమ్మప్ప, బండి రమేష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'చలి'ంచరేమి..?

దీక్షా శిబిరంలోనే అంగన్‌వాడీల నిద్ర

28 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చలించకుండా ఉందని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన 24గంటల దీక్ష సోమవారం రాత్రి కూడా కొనసాగింది. విపరీతమైన చలిలో అంగన్‌వాడీలు శిబిరం వద్దనే నిద్రించారు. కటిక చీకటి, పైగా చలిగాలిని భరిస్తూనే మహిళలు అక్కడ నిద్రించారు. తమ కష్టాలను చూసి అయినా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 'చలి'ంచాలని వారు విజ్ఞప్తి చేశారు.



దీక్షా శిబిరంలో రాత్రి చలిలోనే నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

ఉషశ్రీచరణ్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి :ఎమ్మెల్యే

సమిష్టిగా పనిచేద్దాం : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్

రాబోయే ఎన్నికల్లో పెనుకొండ ఎమ్మెల్యేగా ఉషశ్రీచరణ్‌ను భారీ మెజారిటీతో గెలిపిద్దామని స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారికి ఉషశ్రీచరణ్‌ను పరిచయం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నన్ను ఎలా ఆదరించారో నేటి నుంచి ఉషశ్రీని అలాగే ఆదరించాలన్నారు. మంత్రి ఉషశ్రీ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు పెనుకొండకు ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చానని, అందరికీ అందుబాటులో ఉంటానని, కలిసి కట్టుగా పనిచేసి వైసిపి జెండాను ఎగురవేద్దామన్నారు. సిఎం జగన్ అన్ని వర్గాల ప్రజలకు కుల మతాలు, పార్టీలకతీతంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్దామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామ చంద్ర, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫరూక్, పెనుకొండ సింగిల్‌విండో చైర్మన్ సూర్యప్రకాశ్‌రెడ్డి, కురుబవాండ్లపల్లి సర్పంచి నాగమూర్తి, వైస్ ఎంపిపి రామాంజి, పాల్గొన్నారు.

హామీలు అమలు చేసిన ఘనత సిఎం జగన్‌దే

ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మంత్రి మండల పరిధిలోని మునిమడుగు గ్రామ శివారులో కొండపై వెలసిన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివశంకరప్ప, జడ్పిటిసి శ్రీరాములు, ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, సర్పంచి అశ్వర్థ, నాయకులు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయభార్గవికి సావిత్రిబాయి పూలే అవార్డు

ప్రజాశక్తి-మడకశిర


హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివారం సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవాలు నిర్వహించారు. అందులో మండల పరిధిలోని రేకులకుంట ఉన్నతపాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయురాలు విజయభార్గవి 'హెల్మెట్ పెట్టుకుంటేనే బైక్ ముందుకు కదులుతుంది' ప్రయోగం చేసి చూపినందుకు విజ్ఞాన దర్శిని వారు సావిత్రి బాయి పూలే-2024 అవార్డును ప్రదానం చేశారు. ఆమెను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఉత్సవాల్లో తెలుగు రాష్ట్రా ల్లో విద్యాభివృద్ధికి కృషి చేసిన మహిళా ఉపాధ్యాయులకు సావిత్రి బాయి పూలే అవార్డు ప్రదానం చేశారు.



అవార్డుతో విజయభార్గవి

పార్టీకి పూర్వ వైభవం తెద్దాం

ప్రజాచైతన్య పాదయాత్ర ముగింపు సభలో పరిటాల శ్రీరామ్



బహిరంగ సభలో మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వచ్చే ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తెద్దామని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. పరిటాలశ్రీరామ్ చేపట్టినప్రజా చైతన్యయాత్ర ముగింపులో భాగంగా సోమవారం చేపట్టిన పాదయాత్రకు భారీ స్పందన లభించింది. ఆయా వార్డుల్లో పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈ పాదయాత్ర విజయ వంతం పట్ల పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. అనంతరం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పరిటాల శ్రీరామ్ మాట్లాడారు. ధర్మవరంలో ఏ కాలనీలో చూసిన సమస్యలే కనిపించాయన్నారు. గుడ్మార్నింగ్ అంటే ఏదో ఒక మంచి జరుగుతుందన్న అభిప్రాయం సమాజంలో ఉందని కానీ ఇక్కడ కేతిరెడ్డి చేస్తున్న పనిచూస్తుంటే దారుణంగా ఉందని అన్నారు. చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరించకపోతే ఇక గుడ్ మార్నింగ్ కార్యక్రమం ఎందుకని ప్రశ్నించారు. హ్యాండ్లూమ్ ద్వారా నేసే చీరలకు వ్యాపారం బాగుండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేలా ఒక కార్యక్రమానికి శ్రీకారం చుడతానన్నారు. దర్మవరం ప్రాంతంలో మహిళలకు ఎక్కువమందికి ఉపాధి లేకుండా పోయిందని వారికి గార్మెంట్స్ పరిశ్రమ తీసుకొస్తానని అన్నారు. మరో వైపు ఇక్కడ చేనేత కార్మికులను బెదిరించి వారిని రాజకీయాల్లోకి లాగుతున్నారని విమర్శించారు. ఒక పద్ధతి ప్రకారం కార్పొరేట్ దందా సాగిస్తున్నారని ఆరోపించారు. వీటికి ముగింపు పలుకుదామని పిలుపునిచ్చారు.

పిల్లా కుమారస్వామిరెడ్డికి తెలుగుభాష సేవా ప్రతిభా పురస్కారం

కదిరి టౌన్ : కదిరికి చెందిన పిల్లా కుమారస్వామి రెడ్డికి తెలుగుభాషా సేవా ప్రతిభా పురస్కారం లభించింది.కుమారస్వామి తెలుగుభాషా వికాసానికి చేస్తున్న సేవకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు బాషాభివృద్ధి ప్రాధికార సంస్థ తరపున ఈ పురస్కారం లభించింది. ఈ మేరకు రచయిత, కవి, విమర్శకుడు అయిన పిల్లా కుమారస్వామిని సత్కరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు తెలియజేశారు. ఈ పురస్కారాన్ని అనంతపురం జెఎన్‌టియు. ఆడిటోరియంలో ఈ నెల 9న జరిగే 'అనంత' తెలుగుభాషా వైభవ సదస్సులో అందజేయనున్నట్లు చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఓబుళదేవర చెరువు : స్వచ్ఛభారత్ కార్మికులకు పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు బైటాయించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు. 13 నెలలు, పంచాయతీ కార్మికులకు 8 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వేతనాల చెల్లింపులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కుల్లాయప్ప, పోరాటాల శ్రీరాములు, అంజినప్ప, స్వచ్ఛభారత్ కార్మికులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు

బత్తలపల్లి : బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఎపిఎం సుదర్శన్ రాజు, జెసిఐ అనంతలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం బత్తలపల్లిలోని ఐకెపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ బిఎస్సి నర్సింగ్ కోర్స్, డిగ్రీ పూర్తి చేసుకున్న 20-35 సంవత్సరాల మధ్య గల అభ్యర్థులు జర్మనీ దేశంలో పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారికి అవసరమైన భాషా డొమెన్ వంటి ఇతరత్ర నైపుణ్యంపై కాకినాడ జేఎన్టీయూ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి కలిగినవారు మరింత సమాచారం కోసం జెసిఐ అనంతలక్ష్మి ఫోన్ నెంబర్ 7702100238, 9182316114లో సంప్రదించాలని కోరారు.

బెంగుళూరుకు వెళ్లి పింఛన్ అందజేత

బత్తలపల్లి : బత్తలపల్లిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన మీనుగ కాశప్ప కుమార్తె జ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ బెంగుళూరులోని సెయింట్ జోసెఫ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈమె సామాజిక పింఛను తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో వాలెంటీర్ మాతంగి కాటమయ్య ఆదివారం రాత్రి బెంగుళూరుకు వెళ్లి సోమవారం ఆసుపత్రికి వెళ్లి జ్యోతికి పెన్షన్ నగదు రూ.3వేలు అందించారు. బెంగుళూరుకు వెళ్లి పింఛన్ నగదును అందజేసిన వాలంటీర్ కాటమయ్యను జెడ్పీటీసీ కోటి సుధ, సర్పంచి అక్కిం కాశమ్మ, ఉప సర్పంచు కోటి గోపీనాథ్, సచివాలయ సిబ్బంది సోమవారం అభినందించారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కదిరి టౌన్ : టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని 22వ వార్డులో బూత్ కన్వీనర్ ఇలియాస్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డైమండ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి దాదా పీర్ నవాజ్, డాక్టర్ అష్రాఫ్ అలీ, షకీరా, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను దగా చేసిన జగన్ '

పుట్టపర్తి అర్బన్ : నిరుద్యోగ యువతను జగన్ సర్కారు దగా చేసిందని తెలుగు యువత నాయకులు విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పిన జగన్ నట్టేట ముంచారని విమర్శిస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ముందు తెలుగు యువత నాయకులు నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంటు అధ్యక్షులు బాబ్జాన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, అంబులెన్స్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి పట్టణ అధ్యక్షులుగా పరిశే సుధాకర్



ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా పరిశేసుధాకర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన బహిరంగసభలో పరిశేసుధాకర్‌ను పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా పరిటాల శ్రీరామ్ ప్రకటించారు. పరిశేసుధాకర్ పదేళ్లగా టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి పరిటాలశ్రీరామ్ పట్టణ అధ్యక్షులుగా తనను ప్రకటించినట్టు పరిశేసుధాకర్ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

లేపాక్షి : ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెలో భాగంగా స్థానిక ఎంఇఒ కార్యాలయ సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. వీరికి సోమవారం ఎంఇఒలు నాగరాజునాయక్, కుళ్లాయప్ప, మండలంలోని ఉపాధ్యాయుల జెఎసి తరపున ఏడుగురు సిబ్బందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున రూ. 70 వేలు అందజేశారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'పది' మోడల్ పేపర్లు పంపిణీ

రొద్దం : యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్స్‌ను సోమవారం దొడఘట్ట జడ్పీ హైస్కూల్‌లో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.మారుతి, ఉపాధ్యాయుడు రమేష్, దాత వైటి రెడ్డిపల్లి వార్డ్ మెంబర్ నరేష్ విద్యార్థులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ మోడల్ పేపర్లను బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మారుతిరమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మోడల్‌పేపర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

తాటాకు చప్పుళ్లకు భయపడం



హిందూపురంలో జరిగిన నిరసనలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్



పుట్టపర్తిలో నిర్వహించిన సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు



తలుపులలో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

ప్రజాశక్తి - హిందూపురం

ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ హెచ్చరించారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. ఆందోళనలో భాగంగా అంగన్వాడీలు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి, మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం సమ్మె శిబిరం వరకు ర్యాలీ చేపట్టి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతు ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్-2ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన అంగన్వాడీ కేంద్రాలు తెరిచేది లేదన్నారు. వేతనాలు పెంచుతున్నట్లు మరో జీవో వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఎస్మాను ప్రయోగించిన ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయని గుర్తు చేశారు. అంగన్‌వాడీలకు మద్దతుగా ఈ నెల 9న జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు తీర్మానించాయని చెప్పారు. పట్టుదలతో పోరాడుతున్న అంగన్‌వాడీలకు కేంద్ర కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు అండగా నిలిచినందుకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శైలజ, శిరీషా, నాగమ్మ, రీహాన, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు అంగన్వాడి రిలే నిరాహార దీక్షలు సోమవారం కొనసాగాయి. ఈ దీక్షల్లో ధర్మవరం, బత్తలపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన నాయకులు పాల్గొన్నారు వాసంతి, నూర్జహాన్, నాగలక్ష్మి, నాగసుధ, విజయలక్ష్మి, ఫాతిమా, జయలక్ష్మి సుగుణ, వెంకట్ లక్ష్మి, వన్నూరమ్మ 24 గంటలు నిరాహార దీక్షలో కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ అంగన్వాడీలపై ఉపయోగించి ఎస్మా చట్టం తక్షణం ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. 28వ రోజులుగా సమ్మె చేస్తున్న సమస్య పరిష్కారం చేయకుండా నిర్బంధం ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. తమిళనాడు ముఖ్యమంత్రి, జయలలిత లక్ష 70 వేల మందిని, ఎస్మా ప్రకటించి తొలగిస్తే, వారు తిరిగి కోర్టు ద్వారా ఉద్యోగాలు పొందారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకఉద్యమాన్ని విచ్చిన్నం చేయడానికి పూనుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మాబున్నీ, ప్రధాన కార్యదర్శి కోశాధికారి సిఎస్ శ్రీదేవి, ధర్మవరం ప్రాజెక్ట్ లీడర్లు సరస్వతి, చంద్రకళ, బత్తలపల్లి ప్రాజెక్ట్ లీడర్లు వాసంతి, రజియా, పుట్టపర్తి ప్రాజెక్టు లీడర్లు సుజాత, నాగమణి, మంజుల, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోగా ఉద్యోగాలను తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపులకు దుర్మార్గమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్ నరసింహులు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జీవో నెంబర్ 2 ప్రతులను దహనం చేశారు. నిర్బంధాలతో సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే అంగన్వాడీలు మరింత ఉధతంగా పోరాడుతారే తప్ప భయపడే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రజియా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : ఎస్మా జీవోను వెంటనే రద్దు చేయాలని అంగనవాడీలు, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మహమ్మదాబాద్ క్రాసింగ్ వద్ద 27వ రోజు సమ్మెలో భాగంగా ఓబుళదేరవచెరువు, అమడగూరు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్మా జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శ్రీరాములు, అధ్యక్షులు కుళ్లాయప్ప, సెక్టార్ యూనియన్ లీడర్లు కిష్టమ్మ, పద్మ, మనిమల, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం సమ్మె కొనసాగించారు. అంగన్వాడీల సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి గోవిందు, సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు మద్దతు పలికారు. ఈసందర్భంగా నాయకులు, అంగన్వాడీలు వినూత్న నిరసన తెలిపారు. గోవిందా అంటూ మొక్కుకుంటూ నిరసనకు దిగారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు వై రంగమ్మ, పద్మావతి, లక్ష్మీదేవి, మేరిసుజాత, కమలమ్మ, అరుణమ్మ, గంగాదేవి, చెన్నమ్మతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : జీవో నెంబర్ 2 నుంచి వెంటనే ఉపసంహరించుకోవాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్వాడీలు వర్షం వస్తున్నా లెక్కచేయకుండా నిరసనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, సుజాత, భారతితో పాటు అధిసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

నల్లచెరువు : అంగన్వాడీలపై ఎస్మాచట్టం ప్రయోగించడం దుర్మార్గమని సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్మా చట్టం ప్రతులను సోమవారం స్థానిక బస్టాండ్ కూడలిలో తగలబెట్టారు. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని తెగేసి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకృష్ణ, జిల్లా రైతు సంఘం కౌన్సిల్ సభ్యులు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం రమేష్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగించడానికి వ్యతిరేకిస్తూ సోమవారం అంగన్వాడీ వర్కర్లు టవర్ క్లాక్ వద్ద ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాంతియుతంగా, ప్రజాస్వామ్యతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాబున్నీసా, సుజాత, లక్ష్మీదేవి, సువర్ణ, మాధవి, రామలక్ష్మమ్మ, సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యా యాదవ్, ఆర్ సి పి జిల్లా కార్యదర్శి నాగన్న వారి పార్టీల తరపున అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు.

సోమందేపల్లి : సమ్మెలో భాగంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్వాడీలు జ్యోతులు, కలశాలు తలమీద ఎత్తుకొని స్థానిక వాల్మీకి సర్కిల్ నుంచి అంబేద్కర్, ఎన్టీఆర్ సర్కిళ్ల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. గౌరవ వేతనం మాకొద్దు కనీస వేతనం కల్పించాలి అంటూ నినాదాలు చేస్తూ స్థానిక శివాలయం, షిరిడీసాయిబాబా ఆలయంలో కలశాలు, జ్యోతులు సమర్పించారు. అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శన మన్నారు. ఈ మూర్ఖపు ముఖ్యమంత్రికి దేవుడు కనువిప్పు చేయాలని ప్రార్థించామన్నారు. కార్యక్రమం లో చంద్రకళ, నాగరత్న, శోభ, అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు కుంభకర్ణ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అంగన్వాడీలు, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా కుంభకర్ణుడిలా నిద్రపోతున్న సిఎం జగన్ ఇకనైనా మేల్కొని అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు తిప్పన్న, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయమ్మ, బావమ్మ,సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, అనిత, శ్యామలగౌరీ పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. వీరికి అగళి మండలం టిడిపి దళిత నాయకులు మద్దతు తెలిపారు. దీక్షలో సిఐటియు నాయకుడు మహబూబ్‌ఖాన్, ఎంపిటిసి నాగోజి, క్యాతప్ప, మంజునాథ్, గుండన్న, యూనియన్ లీడర్లు నాగవేణి, అనసూయమ్మ, మంజుల, చంద్రకళ, నాగరత్నమ్మ, సారక్క పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మండలం లోని రైతులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహప్ప, ధనమ్మ, రత్నమ్మ, భాగ్యమ్మ, శివమ్మ, రూప, శశికళ పాల్గొన్నారు.

గోరంట్ల : అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం ముందు యథావిధిగా కొనసాగించారు. వీరికి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పెద్దన్న మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం సరికాదని, ఇది ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం అన్నారు. టిఎన్ఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు జవనడుకు రంగ పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు.



కదిరిలో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు, నాయకులు



సోమందేపల్లిలో జ్యోతులతో అంగన్వాడీల నిరసన



పెనుకొండలో కుంభకర్ణ విగ్రహానికి అంగన్వాడీల వినతి



పొర్లుదండాలు పెడుతున్న పారిశుధ్య కార్మికులు

పొర్లుదండాలతో పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి- హిందూపురం

పారిశుధ్యకార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరింది. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పొర్లు దండాలు పెట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతు ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులను ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె. మల్లికార్జున, కోశాధికార ఆనంద్, ఉపాధ్యక్షులు గురునాథ్, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగులపై అనుచిత వైఖరి తగదు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఎస్ఎస్ఎ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుచిత వైఖరి అవలంభిస్తోందని సర్వ శిక్ష ఉద్యోగుల సంఘం శ్రీ సత్యసాయి జిల్లా జేఏసీ అధ్యక్షులు ఓబిరెడ్డి విమర్శించారు. 20 వ రోజు సమ్మెలో భాగంగా సోమవారం సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యాశాఖలో 20సంవత్సరాల నుండి పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండివైఖరి విడనాడాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామన్న, రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు చంద్రశేఖర్ , నాగరాజు, ఓబులేసు, బాబ్ జాన్ , హరిప్రసాద్ , భవాని, స్రవంతి, ఈశ్వరి, భాగ్యమ్మ ,ఆనంద్, రాజశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు



ధర్నాలో పాల్గొన్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ముదిగుబ్బ : స్థానిక పీవీఎస్ పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు, ఇతర సాంప్రదాయ దుస్తులు ధరించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. విద్యార్థులు గాలిపటాలు ఆనందంగా ఎగరవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గు పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పివి నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మండలంలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతు, పల్లె ఆడపడచ్చు. హరిదాసు, గంగిరెద్దు, బుడబుక్కలవారు వేషధారణలతో అలంరించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్లు రూపరాజా కృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్‌కుమార్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాకతీయ పాఠశాలలో ... పట్టణంలోని కాకతీయ పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణంలో రంగురంగుల ముగ్గులతో, రకరకాల పూలతోగొబ్బెమ్మలు, బోగిమంటలు, పాలపొంగులతో అందంగా అలంకరించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ సమీపంలోని ఎర్రదొడ్డి గంగమ్మ మోరీ వద్ద ఉన్న బ్లూమూన్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను విద్యా సంస్థల సెక్రటరీ శ్రీదేవి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో... పట్టణంలోని నారాయణ హైస్కూల్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఏజీ ఎం రమేష్ బాబు, ఆర్ఐ సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ సర్ఫరాజ్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఏవో జక్రియా, అకాడమిక్ డీన్ విష్ణువర్ధన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ హరిత, రిహానా, సునీత, రాజేశ్వరి, శోభ, అమ్ములు, హరిత, సుజాత విద్యార్థులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పుట్టపర్తికి చెందిన శ్రీవాణి బ్లోసమ్స్ సంస్థ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంస్థ నిర్వాహకురాలు శ్రీవాణి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే ముగ్గులు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కచేరీలు, వంటి ఎన్నో సంప్రదాయాలు ఉన్నాయని, వాటిని ఈ తరానికి తెలిపేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సాధిక్, డ్రాయింగ్ టీచర్ పద్మ, మాధవీలత, విజయలక్ష్మి, అపర్ణ, అశ్విని పాల్గొన్నారు.



ముదిగుబ్బ పివిఎస్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సెక్రటరీ శ్రీదేవి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఎరగుంట పార్కు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన శ్రీరాములు, అతని భార్య మంగమ్మ ద్విచక్రవాహణంలో పట్టణంలోకి వెళ్లి పని పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. ఎరగుంట పార్కు వద్దకు రాగానే పట్టణంలోకి వస్తున్న ప్రసాద్ అనే యువకుడు ద్విచక్రవాహనంలో వస్తూ వీరి వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీరాములు, ఆయన భార్య మంగమ్మతో పాటు ప్రమాదానికి కారణమైన ప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ముగ్గురిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ముదిగుబ్బ : మండల కేంద్రానికి చెందిన వైసిపి హుస్సేన్ పీరా ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మృతుని కుటుంబానికి 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ హైదర్ వలి, సాఫ్టవేర్ సుజీ, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

చెన్నేకొత్తపల్లి : మండల పరిధిలోని చిన్నపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బొగ్గ శ్రీరాములు, బొగ్గ నరసింహులు, గొల్ల దామోదర్, ఎం.ముత్యాలప్ప, వారి అనుచరులు ఎల్.నారాయ ణచౌదరి, చెన్నేకొత్తపల్లి మండల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో అనంతపురంలోని పరిటాల సునీత క్యాంప్ కార్యాలయంలో టిడిపిలో చేరారు. వారికి పరిటాల సునీత టిడిపి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మలేరియా, బోధకాల పరీక్షలపై శిక్షణ

మడకశిర : మండల పరిధిలోని కల్లుమర్రి, బుల్లసముద్రం గ్రామాల్లో మలేరియా, బోధకాల వ్యాధి నిర్ధారణకై రాత్రి పూట రక్త పూతలు సేకరించడంపై సోమవారం మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎస్.షమీఉల్లా, వైద్యాధికారులు డా. మాధుర్య, డా. కె.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎఎన్ఎంలు, ఎల్‌హెచ్‌పిలు, ఎఎస్‌హెచ్‌పిలు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి లక్షణాలను వివరిం చారు. వ్యాధి వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా శాంపిల్ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 7 నుంచి 11 గంటల మధ్యలో రక్త పూతలు తీస్తామన్నారు. కార్యక్రమంలో హుస్సేన్‌బీ, సూపర్ వైజర్లు రాంప్రసాద్, సరస్వతి, ల్యాబ్ టెక్నీషియన్ వనజ, ఆరోగ్య కార్యకర్తలు శేషు, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా : ఆలదపల్లి తిప్పేస్వామి

ప్రజాశక్తి-అమరాపురం

మడకశిర నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచి తనయుడు తిప్పేస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీలకతీతంగా నాయకులు, ప్రజాప్రతి నిధులు, ప్రజలతో స్నేహశీలిగా వ్యవహరిస్తూ ముందుకు కొనసాగుతానన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ప్రతి మండలంలో డిగ్రీ కళాశాల, ఐటిఐ ఏర్పాటు, జీవనోపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.

26 మంది ఎస్ఐలు బదిలీ

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్యసాయి జిల్లాలో 26 మంది ఎస్ఐలను తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి సోమవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. డి. శేషగిరి, ఎ. వెంకటనారాయణ, ఎస్ వెంకట రాముడు, జి. రామకృష్ణయ్య, జి. గోపాల్ ఆర్. మహమ్మద్ రఫీ, ఎస్ ఇక్బాల్ బాషా, జి. హనుమంత్ రెడ్డి, సి. బాబు డి. లక్ష్మీనారాయణ, ఆర్. జయరామప్ప, బి భాస్కర ప్రసాద్ రాజు ,కేఎల్ కళావతి, ఎస్ అబ్దుల్ కలాం ఆజాద్, ఎస్ మహమ్మద్ రఫీ, కే రెడ్డప్ప, పి వెంకటరమణ, కే.శివ శంకర్, బి తులసమ్మ, జి బాలరాజు, కే శ్రీరాములు ,జి వెంకటనారాయణ, ఎస్ ఎ. రఫీక్, శ్రీనివాసులు ,ఎ. దాదా పీర్‌ను బదిలీ చేశారు.

బాబుది మోసాలపై ఆలోచన.. జగన్‌ది సంక్షేమం, అభివృద్ధిపై ఆలోచన...

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపి అధినేత చంద్రబాబు నిత్యం రాష్ట్ర ప్రజలను ఎలా మోసం చేయాలని ఆలోచన చేస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిత్యం సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచన చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం హిందూపురం రూరల్ మండలం చౌళూరు, తూముకుంట, గోళాపురం, కొటిపి, కిరికెర, బేవినహళ్లి పంచాయతీల్లో జరిగిన సమావేశాల్లో పార్లమెంట్ వైసిపి సమన్వయకర్త శాంతమ్మ, అసెంబ్లీ సమన్వయకర్త దీపికతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు ఏ రాష్ట్రంలోను అమలు చేయని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నియోజకవర్గ పరిశీలకులు రెడ్డిఈశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, వైసిపి నాయకురాలు మధుమతి రెడ్డి, జొష్ణ రెడ్డి, జడ్పిటిసి నాగభూషణప్ప, ఎంపీపీ రత్నమ్మ, ఏడిసిసి చైర్మన్ లిఖిత, మండల కన్వీనర్ రాము, సర్పంచులు లలితమ్మ, దేవరాజ్, భాగ్యమ్మ, ఆనంద్, రూరల్ మండల సోషల్ మీడియా కన్వీనర్ రామంజప్పతో పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. వచ్చేది మన ప్రభుత్వమే...

ఎమ్మెల్యే బాలకృష్ణ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

నాయకులు, కార్యకర్తలు ఏ ఒక్కరు అధైర్య పడకూడదని, వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని జెవిఎస్ ఫంక్షన్ హాల్‌లో హిందూపురం రూరల్ మండలంలోని పలు పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారిగ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతు నియోజక వర్గం అభివృద్ధి చేసింది టిడిపి అని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన 5 సంవత్సరాల్లో ఒక గ్రామంలో ఒక రోడ్డు సైతం వేయలేదన్నారు. చివరకు అధిక వర్షాలకు కూలిన వంతెనను సైతం ఇప్పటికి నిర్మాణం చేయలేదన్నారు. సంక్షేమం పేరుతో నాయకులు, మంత్రులు వారి సంక్షేమాన్ని చూసుకుంటున్నారని విమర్శించారు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని వచ్చేది టిడిపి ప్రభుత్వమే అని నాయకులకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో రూరల్ కన్వీనర్ అశ్వర్థరెడ్డి, కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, బాలకృష్ణ వ్యక్తి గత కార్యదర్శి డాక్టర్ సురేంద్రతో పాటు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిభా క్రీడాకారుడిని సన్మానిస్తున్న దృశ్యం

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో కదిరి విద్యార్థుల సత్తా

కదిరి టౌన్ : రాజస్థాన్‌లో ఈ నెల 4 వ తేదీ నుండి 6 వరకు నిర్వహించిన జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీలోల కదిరి పట్టణానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. 24 వ జాతీయ స్థాయి స్క్వే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు కదిరి నుండి ఐదుగురు విద్యార్థులు లోబో, ఖవానకీ పోటీల విభాగాలలో పాల్గొని సత్తా చాటినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుతున్న అన్నచెల్లెళ్లు రీదా, ముస్కాన్ అండర్ 11, 27 కేజీల విభాగాలలో బంగారు పతకాన్ని, ఓపెన్ క్యాటగిరిలో మహమ్మద్ కైఫ్‌కాంస్య పతకాన్ని సాధించారు. సీనియర్ బాలికల -58 కేజీల విభాగంలో చాందిని వెండి పతకాన్ని, బాలుర సీనియర్ ఖవానకీ విభాగంలో మాస్టర్ షాకీర్ కాంస్య పతకాన్ని సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ స్క్వే మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ ఇస్మాయిల్,ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి ఇబ్రహీం, మాస్టర్ ఏపి కోచ్ ఖాదర్ బాషా అభినందించారు.

ఢిల్లీలో వైఎస్ షర్మిలతో కదిరి నాయకుల భేటీ

కదిరి అర్బన్ : వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలతోకదిరికి చెందిన కాంగ్రెస్‌నాయకులు భేటీ అయ్యారు. ఆపార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిఎస్ అహ్మద్ హుస్సేన్ తదితరులు ఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయంలో షర్మిలను కలిశారు. షర్మిల కాంగ్రెస్ గూటికి చేరడంతో ఏపీలో పార్టీ బలపడుతుందని ఈసందర్భంగా ఆయన అభిప్రాయ పడ్డారు.

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలోని రామాపురం గ్రామంలో వరిపంటలో పంటకోత ప్రయోగాలను నిర్వహించినట్లు ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. గ్రామానికి చెందిన రైతు నాగేష్‌కు చెందిన సర్వే నెంబర్ 49-2 లో సాగు చేసిన వరి పంటలో మండల గణాంకశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ పర్యవేక్షణలో ఏఇఒ ఉపేందర్ రెడ్డి,ఉపేంద్రలు పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



శంకరనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

శంకర నారాయణ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

గ్రీన్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శంకర నారాయణ సేవలు ఆదర్శనీయమని పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ అన్నారు. ఆదివారం పుట్టపర్తిలోని సిద్దార్ధ కోచింగ్ సెంటర్లో ఎంఇఒ బొల్లె ప్రసాద్ అధ్యక్షతన శంకర్ నారాయణ కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రీన్ భారత్ ఫౌండేషన్ శంకర్ నారాయణ కు ఢిల్లీ లోని సోక్రటీస్ సోషియల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఇటీవల అంతర్జాతీయ గౌరవ డాక్టరేట్ 2023 అవార్డు ప్రదానం చేసిన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈఆత్మీయ సన్మాన సభకు డీఎస్పీతో పాటు పుడా మాజీ చైర్మన్ కోట సత్యం, ఆల్ట్రా విజన్ ఐ కేర్ హస్పిటల్ చైర్మన్ డాక్టర్ బొగ్గు సురేష్, న్యాయవాది హరికృష్ణ, కరస్పాండెంట్ వల్లం రమేష్‌బాబు హాజరై ప్రసంగించారు. శంకర్ నారాయణ లెక్కల మాస్టారు కాదు మొక్కల మాస్టారు అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. శంకర నారాయణ మాట్లాడుతూ గ్రీన్ భారత్ ఫౌండేషన్‌ను ప్రధానంగా విద్య, వైద్యం, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త చంద్రశేఖర్, గ్రీన్ భారత్ ఫౌండేషన్ సమన్వయకర్తలు వెంకటరత్నం, సుగుణ, ప్రకృతి నాగరాజు, సుకుమార్ గుప్త, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల అలసత్వం

ప్రజాశక్తి తనకల్లు

ప్రజల వద్దకే పాలన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థలో పనిచేసే పలువురు ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. తనకల్లు మండల పరిధిలోని 14 గ్రామ సచివాలయాలలో దాదాపు 162 మంది సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో పలువురు ఉద్యోగులు తమ విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. గ్రామ సచివాయాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం డ్రస్‌కోడ్ విధించింది. అయితే మండలంలోని పలు సచివాయాల్లో పనిచేసే ఉద్యోగులు డ్రస్‌కోడ్ పాటించడం లేదు. డ్రస్‌కోడ్ పాటించడానికే కొంతమంది ఉద్యోగులు నామోషీగా భావిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా పలువురు సమయపాలన పాటించడం లేదు. సచివాలయ ఉద్యోగుల పనితీరు, డ్రస్‌కోడ్ పై స్థానిక ఎంపిడిఒ పూల నరసింహులును వివరణ కోరగా డ్రస్‌కోడ్‌పై పలుమార్లు ఉద్యోగులకు సూచించామని చెప్పారు. వారు ఇలాగే వ్యవహరిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మాదిగల యుద్ధభేరిని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మాదిగల యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సాయి ఆరామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాదిగల యుద్ధభేరి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31న విజయవాడలో రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున మాదిగల యుద్ధభేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజినప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాది గంగిశెట్టి, జిల్లా ఇన్‌ఛార్జి తిప్పయ్య, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, గౌరవ అధ్యక్షుడు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



అర్జీదారుడి సమస్య వింటున్న జేసీ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

అర్జీదారులు పదేపదే కలెక్టరేట్‌కు రానివ్వకుండా త్వరితగతిన వారి పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన జగనన్నకు చెప్పుదాం స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన వారి న ఉంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ఫిర్యాదుదారుల సమస్యలు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, ఆర్‌డిఒ భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయ కోఆర్డినేటర్ శివారెడ్డి, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను చైతన్య పరచాలి : స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటర్లను చైతన్య పరచాలని వారి ఓటును సద్వినియోగం చేసుకునే విధంగా ప్రచారం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్వీప్ కేంద్రాన్ని జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శివరంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ సర్పంచి

గోరంట్ల : మండల పరిధిలోని పాలసముద్రం వద్ద ఉన్న గ్రేట్ వే విల్లాస్‌లో సోమవారం వడిగేపల్లి పంచాయతీ మాజీ సర్పంచి సుశీలబాయి, వైసిపి సీనియర్ నాయకులు శంకర్‌నాయక్ రాష్ట్ర మంత్రి ఉషశ్రీచరణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల వేశారు.

నొలంబవాడి పుస్తక రచయిత సిద్దగిరి శ్రీనివాస్‌కు సన్మానం

హిందూపురం : నొలంబవాడి పుస్తక రచయిత, ఉపాధ్యాయులు సిద్దగిరి శ్రీనివాసులును టిడిపి నాయకులు, ఉపాధ్యాయులు సోమవారం స్థానిక ఎంజిఎం హైస్కూల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు, చరిత్ర సంబంధించి పుస్తకాలు రాసి గత చరిత్ర యొక్క జ్ఞాపకాలను భావితరాలకు అందించే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సిద్దగిరి శ్రీనివాసులు అభినందనీయులని అన్నారు.